అడుగడుగునా అడ్డంకులే..

- కబ్జా కోరల్లో బ్రాడీపేట 4వ లైను
- సగానికి పైగా చిరు వ్యాపారుల ఆక్రమణలు
- సెల్లార్లలోనే వ్యాపారాలు
- నెలవారీ మామూళ్ల మత్తులో అధికారులు

గుంటూరు వెస్ట్: బ్రాడీపేట కబ్జా కోరల్లో కూరుకుపోయింది. నగరంలోనే అతి ఖరీదైన వ్యాపార సముదాయాలున్న ప్రాంతాల్లో బ్రాడీపేట ఒకటి. ఖరీదైన వ్యాపార సముదాయాలతోపాటు విద్యా సంస్థలకు ఇది నిలయం. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. మౌలిక వసతులు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇటీవల బ్రాడీపేట 4వ లైనును సగం వరకు నిర్మించి మిగతాది వదిలేశారు. రోడ్డు నిర్మాణంతో కొన్ని ఇబ్బందులు తొలగినా చిరు వ్యాపారులు రోడ్డుకు సగానికి పైగా ముందుకు రావడంతో వాహన చోదకులతోపాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్రాడీపేట 4/1 నుంచి శంకర్ విలాస్ వైపు వెళ్లే రహదారి పొడవునా చిరు వ్యాపారులు అడ్డంగా వ్యాపారాలు సాగిస్తున్నారు. స్థానిక వ్యాపారులు అనేక మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం...


చిరు వ్యాపారులతో కబ్జాకు గురైన బ్రాడీపేట 4/1 ప్రాంతం


ఒక వాహనం వచ్చినా ఇదీ పరిస్థితి

ట్రాఫిక్ పెద్ద సమస్య

నగరంలో వాహనాల రద్దీ పెరుగుతున్నట్లు ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ఇటీవల డొంకరోడ్డు సమీపంలోని మూడు వంతెనల నిర్మాణం కారణంగా అటువైపు రాకపోకలు పూర్తిగా నిషేధించారు. ప్రత్యామ్నాయ మార్గాలవైపు అధికారులు చూస్తున్నా చిత్తశుద్ధి లేకపోవడంతో అవి ఫలించడంలేదు. బ్రాడీపేటలో దాదాపు 20కు పైగా వ్యాపార సముదాయాలకు కనీసం సెల్లార్ పార్కింగ్ సదుపాయం లేదు.

వ్యాపారులు, అందులోని ఉద్యోగులు వారి వాహనాలను రోడ్డుపైనే పెడుతున్నారు. దీంతోపాటు వినియోగదారుల వాహనాలు రోడ్లపైనే ఉంటున్నాయి. కనీస పార్కింగ్ సదుపాయం లేకుండా నిర్మాణాలకు ఎలా అనుమతిస్తున్నారని స్థానిక నివాసితులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. సెల్లార్లలో పార్కింగ్ ఏర్పాటుతో చాలా సమస్యలు పరిష్కారమవుతాయి.

మామూళ్ల మత్తులో..

బ్రాడీపేట 4వ లైన్లో చిరు వ్యాపారుల నుంచి కొందరు సిబ్బంది నెలకు మామూళ్ల వసూలు తీసుకుంటున్నారు. అందుకే స్థానికులుగాని, స్థానిక వ్యాపారులు గాని అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా సిబ్బంది పట్టించుకోవడంలేదు. ముఖ్యంగా 4/1 ప్రాంతంలో సమస్య మరీ దారుణంగా ఉంది. ఇక్కడ పేరొందిన హోటల్‌కు కనీసం పార్కింగ్ సదుపాయం లేదు. దీంతో హోటల్ ముందే వాహనాల రద్దీ. ఇక్కడే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారులు రోజు రోజుకు ముందుకు చొచ్చుకు వస్తున్నారు. గతంలో ట్రాఫిక్ పోలీసులు వచ్చి పరిశీలించేవారు. ఈ మధ్య కాలంలో వారు కూడా సీతకన్నేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అనేక మంది ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణం.

ప్రత్యామ్నాయాలు పరిశీలించాలి



నిత్యం వాహనాల రద్దీ ఈ ప్రాంతంలో పెరిగిపోతుంది. దీనికి ప్రత్యామ్నాయాలు వెతకాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. రోడ్లు సంపూర్ణంగా విస్తరిస్తే మంచి ఫలితాలుంటాయి. సెల్లార్లలో పార్కింగ్ చేసే విధంగా వ్యాపారులను ప్రోత్సహించాలి. ఖాళీ స్థలాల్లో పెయిడ్ పార్కింగ్ సౌకర్యం కల్పించడం. పోలీస్, మున్సిపల్ అధికారుల సమన్వయం ఎంతో కీలకం.

– కస్తూరి, స్థానికురాలు

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

లక్ష్మీపురం: వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. సీతమ్మకాలనీ ప్రాంతానికి చెందిన పెదాల బంగారమ్మ ఇళ్లలో పని చేసుకుంటూ ఉంటుంది. భర్త పి.పోతురాజు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. భార్య ఐదు నెలల గర్భిణి అయితే మంగళవారం రోజు మాదిరిగానే పనికి వెళ్లిన భర్త తిరిగి సాయంత్రం ఇంటికి రాలేదు. దీంతో భార్య బంధువులు, సన్నిహితులు, చుట్టు పక్కల వారిని విచారించగా ఎంతకు సమాచారం తెలియలేదు. దీంతో భార్య బుధవారం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వ్యక్తి మృతి

ఓ అపార్ట్‌మెంట్‌లో పని చేస్తూ నీటి మోటర్ స్విచ్ ఆన్ చేయగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మృతి చెందిన ఘటన ఈనెల 16వ తేదీన చోటు చేసుకుంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఏటీ అగ్రహారం 12వ లైన్‌కు చెందిన ఇర్ల వీరాంజీ(30) భార్య ఇర్ల కుమారిలకు ముగ్గురు ఆడ సంతానం ఉన్నారు. భార్య కూలీ పనులు చేస్తుంటుంది. భర్త శ్రీరామనగర్ మహావీర్ అపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నాడు. ఈనెల 16వ తేదీన రోజు మాదిరిగానే నీటి మోటార్ స్విచ్ ఆన్ చేస్తున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో అక్కడిక్కడే అపస్మారక స్థితిలో పడి పోయాడు. దీన్ని గమనించిన అపార్ట్‌మెంట్ వాసులు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో ఆస్పత్రి సిబ్బంది మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సమాచారం తెలుసుకున్న భార్య కుమారి ఆస్పత్రికి చేరుకుని సంబంధిత అవుట్ పోలీసులకు వివరాలను తెలియజేసి నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో బుధవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

జీజీహెచ్‌లో అడిషనల్ డీఎంఈ సమీక్ష

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో బుధవారం అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేష్, పలు వైద్య విభాధిపతులు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణతో సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రిలో నిర్మాణంలో ఉండి, ఆగిపోయిన పలు భవనాలను పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రణాళికా బద్ధంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలు జాప్యం జరుగకుండా చూడాలని పేర్కొన్నారు. నిలిచిపోయిన భవన నిర్మాణాలను, పలు వైద్య విభాగాలను పరిశీలించారు.

భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారం

ప్రత్తిపాడు: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సంబంధ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపడం జరుగుతుందని తహసీల్దార్ జి.కరుణకుమార్ అన్నారు. మండల పరిధిలోని ఈదులపాలెంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ రకాల భూ సంబంధ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి అందిన అర్జీలను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ ధర్మతేజ పాల్గొన్నారు.

యోగాసన స్పోర్ట్ చాంపియన్‌షిప్‌లో విజయలక్ష్మికి స్వర్ణపతకం



నగరంపాలెం: ఐదో సీనియర్ నేషనల్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో గుంటూరుకు చెందిన విజయలక్ష్మి స్వర్ణపతకం సాధించింది. కర్ణాటకలోని తుమకూరులోని మహాత్మాగాంధీ స్టేడియంలో ఈనెల 12–15వ తేదీ వరకు ఐదో సీనియర్ నేషనల్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. సీనియర్ మహిళల విభాగంలో(45–55 ఏళ్లు) ఆమె స్వర్ణపతకం సాధించారు. విజయలక్ష్మి యోగాను అభ్యసించడం, రాష్ట్రంలోని యోగ నిపుణుల నుంచి మార్గనిర్దేశం పొందడం గెలుపునకు ప్రత్యేకంగా నిలుస్తోంది. అమరావతి యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. గుంటూరులోని వైఎంకే యోగా సెంటర్‌లో తన నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ ఈ జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్‌కి సిద్ధమయ్యారు. విజయలక్ష్మిని ఆంధ్రప్రదేశ్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ (వైఎస్ఏఏపి) అధ్యక్షురాలు డాక్టర్ ఎ.రాధిక, ప్రధాన కార్యదర్శి ప్రేమ్ కుమార్ అభినందించారు.

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన ఉండాలి



గుంటూరు మెడికల్: విద్యార్థులు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండటం వల వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని అహల్య ట్రస్టు డైరెక్టర్, ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్యురాలు డాక్టర్ శనక్కాయల రాజకుమారి అన్నారు. బుధవారం గుంటూరు ఆర్టీసీ కాలనీలోని సెయింట్ లారెల్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డాక్టర్ శనక్కాయల రాజకుమారి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ తప్పనిసరిగా రెండు సార్లు దంతాలు శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్కూలు వ్యవస్థాపకుడు ఎం.రవీంద్రబాబు, ఎం.సాయి శ్రీకర్, ఎం.భవ్య శ్రీ సాయి, ప్రిన్సిపాల్ ఎ.కళ్యాణి, హెచ్ఎం కె.మీనాక్షి, టీచర్ కె.కరుణ జ్యోతి పాల్గొన్నారు.

వైభవ విశేషాలపై ఆధ్యాత్మిక ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం మంగళాశాసనం పాశురం, వామనావతార వైభవ విశేషాలపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శ ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. తిరుప్పావై అమృతవర్షిణి డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి ప్రసంగిస్తూ మంగళముగుగాక జయమంగళం! మంగళమగు గాక శ్రీ పాదములకు!' అని అండాళ్ తల్లి స్వామి ఆయా అవతారాల్లో ప్రదర్శించిన పరాక్రమ ఆశ్రిత రక్షణా వాత్సాల్యలకు ముగ్ధురాలై మంగళాశాసనం పాడిందని అన్నారు. వ్యాస భాగవతంలోని ఘట్టం మూలమైనా తెలుగు వారిలో పోతన శ్రీమదాంధ్ర భాగవతంలోని వామన చరిత్రమే సుప్రసిద్ధమని భగవత్ భక్తులకు సవివరంగా తెలిపారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను తొలగించాలి

సీపీఎం నగర కార్యదర్శి కె.నళినికాంత్

లక్ష్మీపురం: ఉచిత విద్యుత్ లబ్ధిదారుల ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం అన్యాయమని సీపీఎం నగర కార్యదర్శి కె.నళినికాంత్ పేర్కొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య నగర్ 41వ డివిజన్‌లో బుధవారం 15 ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించిన వాటిని తొలగించి పాత మీటర్లనే కొనసాగించాలని సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఎ.పి.సి.పి.డి.సి.ఎల్ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ కేవీఎల్ మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార వాణిజ్య సముదాలకు, 500 యూనిట్లకు పైగా కరెంటు వాడే వారికి మాత్రమే స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు బిగిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించడం జరిగిందన్నారు. దానికి భిన్నంగా పేదల ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని ఆరోపించారు. వెంటనే స్మార్ట్ మీటర్లు బిగించిన వాటిని తొలగించాలని కోరారు. దీనికి ఎస్ఈ మూర్తి, అధికారులను సంప్రదించి వెంటనే పేదల ఇళ్లకు బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించి పాత మీటర్లనే కొనసాగించే దానికి కృషి చేస్తామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పార్టీ నగర నాయకులు షేక్ ఖాశిం షహీద్, ఆది నికల్సన్ తదితరులు ఉన్నారు.


విద్యుత్ శాఖ ఎస్ఈ మూర్తికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మొదలైన 'చాంబర్' ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

నగరంపాలెం: ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్(ఐసీసీ) ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. బుధవారం జిన్నాటవర్ కూడలిలోని కార్యాలయంలో అధ్యక్ష పదవికి యేల్చూరి వెంకటేశ్వర్లు, రంగా బాలకృష్ణ, రంగా రామకృష్ణ నామినేషన్లు దాఖలు చేశారు. తొలుత యేల్చూరి వెంకటేశ్వర్లు తూర్పు ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు కూటమి తరపున ఆయన్ను అధ్యక్ష పదవికి బరిలో దించినట్లు తెలుగు తమ్ముళ్లు తెలిపారు. యేల్చూరి వెంట టీడీపీ కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్(సిటిబస్ బాబు), నాయకులు కొనకళ్ల సత్యం, శేఖర్, తల్లం కన్నా, వెంకట్, వనమా నరేంద్ర పాల్గొన్నారు. 25వ తేదీ లోపు ఎవరెవరూ బరిలో ఉంటారనేది ప్రకటిస్తామని కార్యాలయపు వర్గాలు తెలిపాయి. 28న చాంబర్ ప్రధాన కార్యాలయంలో ఉదయం 8.30 గంటలకు ఓట్ల నమోదు ప్రక్రియ మొదలై, సాయంత్రం 5 గంటలకు ముగుస్తోందని అన్నారు. సాయంత్రం నుంచి ఓట్ల లెక్కింపు నిర్వర్తించి, నూతన అధ్యక్షుడ్ని ప్రకటిస్తామని ఎన్నికల నిర్వాహకులు తెలిపారు.


ఎమ్మెల్యేని కలిసి యేల్చూరి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు

కొత్తపేట పోలీసు స్టేషన్ తనిఖీ

పట్నంబజారు: ప్రతి పోలీసు స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ చెప్పారు. ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపేట పోలీసు స్టేషన్‌లో బుధవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్‌లో రికార్డులు తనిఖీలు చేశారు. కొత్తపేట పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎం.వీరయ్య స్టేషన్‌కు సంబంధించిన పూర్తి అంశాలను డీఎస్పీకి వివరించారు. ఈసందర్భంగా డీఎస్పీ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రికార్డులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని సూచించారు. వారెంట్లు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు నిందితులను పట్టుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో సిబ్బంది సత్ప్రవర్తన కలిగి, వారికి న్యాయం జరిగేలా దృష్టి సారించాలన్నారు. బాధితుల పక్షాన పోలీసులు ఉన్నారనే ధైర్యం కల్పించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. తనిఖీల్లో ఎస్ఐలు రమేష్, తరంగిణి ఉన్నారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్, చిత్రంలో ఎస్‌హెచ్‌ఓ వీరయ్య

ఫార్మసిస్టులకు విదేశాల్లో ఉద్యోగావకాశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీ పట్టభద్రులకు విదేశాల్లో విస్తృత ఉద్యోగావకాశాలు ఉన్నాయని హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో బుధవారం విదేశాల్లో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలపై ఎకో ఓవర్సీస్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రంగరాజు మాట్లాడుతూ ఫార్మా, హెల్త్‌కేర్ విద్యార్థుల కోసం విదేశాల్లో ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఫార్మా విద్యార్థుల కోసం విదేశీ విద్యలో ఉన్న ప్రత్యేక అవకాశాలపై రూపొందించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఎకో ఓవర్సీస్ చైర్మన్ డాక్టర్ నలబోతు రమేష్ మాట్లాడుతూ ఫార్మసీ కోర్సులను చదివేందుకు పుష్కలమైన అవకాశాలతో పాటు చదువుతూ ఉద్యోగం చేయడంతో పాటు ఉన్నత విద్య అనంతరం ఉద్యోగాలకు సంపూర్ణ అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం యూఎస్ఏ, యూకే, ఐర్లాండ్, కెనడా, ఆస్ట్రేలియా, యూరప్ వంటి దేశాల్లో ఫార్మసీ రంగంలో ఉన్న అవకాశాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సీతారామయ్య పాల్గొన్నారు.


బ్రోచర్ విడుదల చేస్తున్న జూపూడి రంగరాజు, నాగభూషణం, రమేష్, సీతారామయ్య

రేపు ఐఎంఏలో సీఎంఈ

గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20న నిరంతర వైద్య విద్య కార్యక్రమం (సీఎంఈ) నిర్వహించనున్నట్లు అసోసియేషన్ గుంటూరు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు, డాక్టర్ జాలినేని సాయికృష్ణ తెలిపారు. గుంటూరు ఐఎంఏ హాలులో జరిగే సీఎంఈ కార్యక్రమానికి లండన్ రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్ నుంచి డాక్టర్ సుబ్రహ్మణ్యం కరుటూరి వస్తున్నట్లు వెల్లడించారు. మధుమేహం తగ్గించుకోవడం, వ్యాధి నుంచి విముక్తి పొందడానికి ఎలాంటి పద్ధతులు అవలంబించాలి, మధుమేహం రాకుండా ఎలాంటి ఆహారం తీసుకోవాలి, మధుమేహం నియంత్రణకు ఇన్సులిన్ ఏమేరకు ఉపయోగపడుతుందనే విషయాలను సీఎంఈలో వివరించనున్నారు. యువ వైద్యులు, వైద్య విద్యార్థులు సీఎంఈకు హాజరై తమ సందేహాలు నివృత్తి చేసుకోవాలని కోరారు.

కళ్లజోళ్ల పంపిణీకి దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు మెడికల్: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో స్కూల్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, అంధత్వ నియంత్రణ సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్ బుధవారం తెలిపారు. వివరాలకోసం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు

పట్నంబజారు: గుంటూరు నగరంలోని పాతగుంటూరు పోలీసు స్టేషన్ పరిధిలో ఈనెల 16వ తేదీ రాత్రి చోటుచేసుకున్న చప్పిడి దీపక్ (27) హత్య కేసులో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. హత్య కేసులో మృతుడిని నకిలీ పేరుతో హాస్పిటల్‌లో చేర్పించిన అంశం, నిందితుడిని ఆటోలో తీసుకెళ్లిన అంశాన్ని పరిశీలిస్తున్నారు. హత్యకు సంబంధించి వినియోగించిన ఆటోను కూడా వీరిదా, లేక బయట వ్యక్తిదా అనే కోణంలో విచారణ చేస్తున్నారు. హత్య అనంతరం గుంటూరు నగరంలో పట్టుబడిన ప్రధాన నిందితుడు కిరణ్ చెప్పిన విధంగా ఆరోజు రాత్రి మద్యం తాగి మృతుడు దీపక్‌ను కొట్టి, అతని చావుకు కారకులైన మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మరికొద్దిరోజుల్లో అధికారికంగా అరెస్టు చూపే అవకాశం ఉంది.

పెనుగొండ లక్ష్మీనారాయణకి అభినందనలు

లక్ష్మీపురం: ప్రముఖ అభ్యుదయ కవి పెనుగొండ లక్ష్మీనారాయణకి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కడం అభినందనీయమని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు బుధవారం తెలిపారు. పెనుగొండ లక్ష్మీనారాయణ సమాజంలో ప్రజలు ఎదుర్కొనే అనేక సమస్యలను ప్రతిబింబిస్తూ రచనలు చేశారని పేర్కొన్నారు. పేదల సమస్యలు, వాటి పరిష్కారాలు తన రచనల్లో ప్రధానంగా చర్చించే వారని, అభ్యుదయ భావజాలాన్ని పెంచేందుకు నిరంతరం కృషి చేశారని, వారికి అవార్డు రావడం అభ్యుదయ శక్తులకు ఉత్సాహాన్నిస్తుందని తెలిపారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు



నగరంపాలెం: క్రీస్తు జననం అనగా ప్రేమ, శాంతి, సంతోషం, సమాధానం క్షమాగుణమని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని హాల్‌లో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ అందరూ క్రీస్తు సుగుణాలను అలవర్చుకోవాలని అన్నారు. క్రిస్మస్ పర్వదినం అందరికి సంతోషం, ప్రేమ, శాంతి కలుగజేయాలని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ కేక్ కట్ చేసి, క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ సర్వీస్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ(పరిపాలన) జీవీ రమణమూర్తి, ఏఓ అద్దంకి వెంకటేశ్వరరావు, బి.సెక్షన్ సూపరింటెండెంట్ రమాదేవి, స్టోర్ సెక్షన్ సూపరింటెండెంట్ కె.సుభాషిణి, ఎస్‌బీ డీఎస్పీ బి.సీతారామయ్య పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

వీసీ గంగాధరరావు

ఏఎన్‌యూ: ఫార్మసీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ కోర్సుల్లో నూతనంగా అడ్మిషన్ పొందిన విద్యార్థుల పరిచయ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో బీ ఫార్మసీ ఎం.ఫార్మసీ వంటి కోర్సులు చేసిన విద్యార్థులకు మెండుగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రస్తుత ఆహారపు అలవాట్లలో విపరీతంగా మార్పులు వచ్చాయని దీని వల్ల ప్రజలు అనేక రకాల రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ఆహారపు అలవాట్ల నియంత్రణతో పాటు రోగాలను తగ్గించే ఔషధాలను తయారు చేసే బాధ్యత ఫార్మాసిస్టులపై ఉందన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఎ.ప్రమీలా రాణి మాట్లాడుతూ ఏఎన్‌యూ ఫార్మసీ కళాశాలకు ప్రత్యేక స్థానం ఉందని విద్యార్థులకు అన్ని వసతులు కలిస్తున్నామని తెలిపారు. బాలికల వసతి గృహాల చీఫ్ వార్డెన్ డాక్టర్ మాధవి మాట్లాడుతూ బాలికల వసతి గృహంలో అన్ని రకాల మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు.


మాట్లాడుతున్న వీసీ గంగాధరరావు

జనసేనలోని ఎస్సీ ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఇవ్వాలి

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వంలో భాగమైన జనసేన పార్టీ తరపున 21 సీట్లు గెలిస్తే అందులో మూడు ఎస్సీ ఎమ్మెల్యేలు ఉన్నారని వారిలో ఒకరికి మంత్రి వర్గంలో చోటు కల్పించాలని దళిత, బహుజన ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ జనసేన తరపున ఒక్క ఎస్సీకి మంత్రి వర్గంలో స్థానం కల్పించకపోగా తిరిగి ఇంకో పవన్ కళ్యాణ్ అన్న అయిన నాగబాబుకి జనసేన తరపున ఇంకోక మంత్రి పదవి కట్టబెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, మంచాల జోసెఫ్, చిరతనగంట్ల వాసు, కర్ర హనోక్ బెంజిమెన్, చెరబండ రాజు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

వైభవంగా శ్రీసీతారాముల కళ్యాణం


హాజరైన భక్తులు


మంగళ సూత్రం చూయిస్తున్న అర్చకులు

నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్ శ్రీరామనామ క్షేత్రంలో శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీమాన్ క్రోసూరి మురళీకృష్ణమాచార్యులు, ఆలయ అర్చకుల బృందం ఆలయ ప్రాంగణంలో నూతన శ్రీరామకోటి స్తూపాన్ని శ్రీమాన్ ధనకుదరం సీతారామానుజాచార్యుల విశేష పూజలు నిర్వహించి ఆవిష్కరించారు. శ్రీబాలాంజనేయస్వామి విగ్రహాన్ని ఆవిష్కరించగా, కల్యాణ మూర్తులను సపరివారంగా విద్యాభారతి ఉపన్యాస సదనానికి మేళ తాళాలతో భక్తుల శ్రీరామనామ ఘోషతో చేర్చారు. క్రోసూరి మురళీకృష్ణమాచార్యులు కల్యాణంలో అనేక అంశాలను భక్తులకు వివరిస్తూ వేద మంత్రాల నడుమ కళ్యాణం నిర్వహించారు. భారీ సంఖ్యలో హాజరైన భక్తులకు అన్న ప్రసాద వితరణ తోపాటు కల్యాణ తలంబ్రాలను అందించారు. వాక్యాన్ని శేష సాయి, తిరుమల వారి విశ్వామిత్ర యాగరక్షణ పురాణం, బసవరాజు జయశంకర్ భక్తి రంజని భక్తులను అలరించాయి. సాయంత్రం శ్రీ కల్యాణ సీతారాముల తిరువీధి ఉత్సవం కనుల పండువగా జరిగింది. శ్రీశృంగేరి పీఠపాలిత శ్రీ సీతా రామ సంకీర్తన సంఘం, శ్రీరామనామక్షేత్రం కార్య నిర్వాహకులు రాగం వెంకటలీలాసుందరి, మస్తాన్‌రావు దంపతులు, పోలిశెట్టి హరిప్రసాదరావు, క్షేత్ర పాలకమండలి సభ్యులు పాతకోటి బ్రాహ్మణయ్యానాయుడు, పబ్బిశెట్టి బాబూరావు, కొత్తూరి రామ్మోహనరావు, సుబ్బారావులు తదితరులు పాల్గొన్నారు.